

హజ్ యాత్రకుడికి ఘన సన్మానం

నవతెలంగాణ- మహబూబ్ నగర్

జీకే షోటోకాన్ సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాల ఆవరణలో శుక్రవారం పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు అలీమోద్దిన్ ను ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీకే షోటోకాన్ ఫౌండర్, చీఫ్ ఇన్స్ట్రక్టర్ జి. కృష్ణయ్య, సీనియర్ మాస్టర్ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళుతుండడం ఎంతో అదృష్టమన్నారు.హజ్ యాత్రలో ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని కోరారు.అనంతరం అలీమొద్దిన్ చేతుల మీదుగా పలువురు కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ శివకుమార్, బ్లాక్ బెల్ట్ మస్టర్లు అఖిలేశ్వర్ రెడ్డి, మహిమాన్విత, రిశ్విత్, భవిత పాల్గొన్నారు.

నవతెలంగాణ మహబూబ్‌నగర్

1 శనివారం 10 జూన్ 2023



కల్వకుర్తిలో 100 పడకల ఆస్పత్రి ..

హామీ ఏదీ..!

- ప్రజా ప్రతినిధుల చేతగానితనం వల్లే అభివృద్ధిలో వెనుకబాటు..
- అచ్చంపేట, జడ్చర్ల లో వంద పడకల ఆస్పత్రులు ప్రారంభించుకున్న ఎమ్మెల్యేలు



నవతెలంగాణ- కల్వకుర్తి

అన్నీ ఉన్న అల్లుని నోట్లో శని అన్నచందంగా మారింది కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి. కల్వకుర్తి నియోజకవర్గం పేరు ప్రతి ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా మారు మోగుతుంది, అభివృద్ధి విషయానికి వచ్చేసరికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఉమ్మడి జిల్లాలో పక్క నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు 100 పడకల ఆసుపత్రుల భవనం నిర్మాణం చేపట్టి ఈ మధ్యకాలంలోనే మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభించుకున్నారు. ఇక్కడ మాత్రం 100 పడకల ఆసుపత్రి వూసే లేదు.. స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ 100 పడకల ఆసుపత్రి అదిగో వచ్చే.. ఇదిగో వచ్చే.. అంటూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలలో ఆశలు రేపుతున్నారు తప్ప ఆచరణలో మాత్రం అమలు పరచడం లేదు. ఆస్పత్రి సలహా సంఘం ప్రతి సమావేశంలో 100 పడకల ఆసుపత్రి గురించి ప్రస్తావించడం చప్పట్లు కొట్టి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి లేకపోవడం వల్ల ప్రజలు హైదరాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాలకు వైద్యం కోసం వెళతున్నారు. హైదరాబాద్ శ్రీశైలం కొల్లాపూర్ కోదాడ ప్రధాన రహదారిపై తరచు ప్రమాదాలు చోటు చేసుకోవడం వల్ల క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో ప్రమాదంలో గాయపడి అనేకమంది చనిపోతున్నారు.

50 పడకల ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా మారింది..

కల్వకుర్తి పట్టణంలో ఉన్న 50 పడకల ఆసుపత్రి నేడు 30 పడకల ఆసుపత్రిగా మారింది. గదుల కొరత కారణంగా బెడ్స్ తొలగించి అందులో రోగులకు ఇతర సౌకర్యాలు కల్పించారు. దీంతో రోజులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రిలో కేవలం ప్రసవాలు తప్ప ఇతర రోగాలకు సరైన వైద్యం అందడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా అందక రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు.



50 పడకల ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా మారి ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులకు గురి అవుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజు దానికి 100 లక్షలు దీనికి 100 లక్షలు అంటూ గొప్పోలు చెప్పే స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి విషయంలో అంతగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వంద పడకల ఆసుపత్రి రాకపోవడం మన ప్రజాప్రతినిధుల చేతగానితనానికి నిదర్శనం అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



కల్లబొల్లి మాటలతో ప్రజాప్రతినిధులు కాలం గడుపుతున్నారు



కల్లబొల్లి మాటలతో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కాలం గడుపుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా 100 పడకల ఆసుపత్రి అదిగో వచ్చే ఇదిగో వచ్చే అంటూ ప్రజలను మభ్యపెడుతూ వచ్చారు. 50 పడకల ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రి గా మారితే ఎమ్మెల్యే ఎంపీ ఏం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలపై ఏమాత్రం వారికి ప్రేమ లేదు అందుకే ఆసుపత్రి గురించి పట్టించుకోవడం లేదు.

ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు.

గొల్ల కురుమలకు సర్కార్ అండ

- కులవృత్తులకు సర్కార్ చేయూత
- రెండో విడత గొర్రెల పంపిణీ
- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవ తెలంగాణ- జడ్చర్ల /బాలానగర్

తెలంగాణ ప్రభుత్వం కుల వృత్తులకు చేయూతనందిస్తుందని, అందులో భాగంగానే గొల్ల కురుమలను ఆర్థికంగా ఆదుకునేందుకు సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ శతాబ్ది ఉత్సవాలలో జడ్చర్ల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో రూ.72కోట్లతో 4,119 మంది లబ్ధిదారులకు 86,499 గొర్రెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెండో విడతలో భాగంగా రాజాపూర్ కు 12 యూనిట్లు, బాలానగర్ కు 12యూనిట్లు చొప్పున్న ఆయన పంపిణీ చేశారు. కులవృత్తులను ప్రోత్సహించాలి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఆలోచనల నుంచి రూపొందినదే గొర్రెల యూనిట్ల పంపిణీ కార్యక్రమని పేర్కొన్నారు. గొర్రెల పెంపకం వృత్తిగా జీవనం సాగిస్తున్న గొల్ల, కురుమలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచన తో ఈ పథకానికి స్వయంగా ముఖ్యమంత్రే రూపకల్పన చేశారన్నారు. మొదటి విడతలో నియోజకవర్గంలో రూ.50 కోట్లతో 4037 మంది లబ్ధిదారులకు 84,777 గొర్రెలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను విస్మరిస్తే మంత్రుల ఇండ్లు ముట్టడిస్తా

- 17 వరకు రాజీవ్ గాంధీ ఆన్లైన్ల రిజిస్ట్రేషన్లు
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూర్ వెంకట్



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్,ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వడంలో ప్రభుత్వం విస్మరిస్తే మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరు వెంకట్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గడచిన టిఆర్ఎస్ పాలనలో విద్యార్థుల న్యాయం చేయడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని వారు అన్నారు. ఇప్పటివరకు ఉపకార వేతనాలు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో పేద బడుగు బలహీనవర్గ విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని వారు అన్నారు. నిన్న జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్ మల్లారెడ్డి స్థానిక మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎందుకు పాలమూరు యూనివర్సిటీని సందర్శించి అక్కడి విద్యార్థుల విషయాలను తెలుసుకోలేదని వారు ప్రశ్నించారు. ఆ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ స్టాప్ లేక కాంటాక్ట్ సిబ్బందితోనే విద్యా సంవత్సరం కొనసాగు తోవడం అన్యాయం అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు నిధులు ఇవ్వకుండా విద్యను పూర్తిగా నిర్లక్ష్యానికి వదిలేసిందని వారు అన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల రావలసిన బకాయిలు విడుదల చేయకపోతే ఈనెల 20 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆన్లైన్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎలక్ట్రానిక్ స్కూటర్లు 40 అందిస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్ఈవై మండల కమిటీలు వేస్తూ నిర్మాణంపై దృష్టి పెట్టామని ఈనెల చివరికల్లా పూర్తి చేసి ఎంపికైన లీడర్లకు శిక్షణ తరగతులు ఇస్తున్నామని ఈ సమావేశంలో ఎన్ఎస్ఈవై రాష్ట్ర సహకార దర్శి రమేష్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ఆవేజు తదితరులు పాల్గొన్నారు.

130 బీసీ కులాలను మోసం చేసిన కేసీఆర్

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ గౌడ్



నవతెలంగాణ -మహబూబ్ నగర్

తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వ తోమిదేళ్ల పాలనలో రుణం కోసం బీసీలు దరఖాస్తు చేసుకున్న తొమ్మిది లక్షల తిరస్కరించి 130 కోట్ల బీసీలను మోసం చేసిన ఘనత ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ పోరాటంలో కీలక పాత్ర పోషించిన 130 కులాలను కాదని ఓట్ల కోసము మాత్రమే 15 కులాలకు రుణం ఇవ్వడానికి కేసీఆర్ బీసీ బంధు పథకాన్ని ప్రారంభించారని ఆరోపించారు. ఎలక్షన్ సమయంలో టిఆర్ఎస్ కార్యకర్తల జీతాల కోసం ఈ పథకం తీసుకువచ్చారని వారు ఎద్దేవా చేశారు. బీసీలపై ఏమాత్రం విశ్వాసం ఉంటే బిస్వాల్ కమిటీ చేసిన సిఫారసులను ఏనాడో ఈ ప్రభుత్వం అమలు చేసి ఉండేదని వారు గుర్తు చేశారు. ఈ తొమ్మిదేళ్లలో బీసీలు ప్రభుత్వం రుణం కోసం తొమ్మిది లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే ఏనాడు బీసీ కార్పొరేషన్కు నిధులు కేటాయించిన దాఖలు లేవని వారు అన్నారు. కెసిఆర్ పాలనలో బీసీల అభివృద్ధి కోసం బడ్జెట్లో 900 కేటాయించి ఎలక్షన్స్ సమయం రాగానే 250 కోట్లతో 20వేల మంది బీసీలకు రుణం చెందకు ఈ పథకం ప్రవేశపెట్టడం మిగతా కులాలను అవమానపరచడమే అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ బలహీన వర్గాలను మరోసారి మోసం చేసేందుకు కేసిఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణ సాయం ముందుకు తెచ్చిందని వారు అన్నారు. కేవలం బీసీ జనాభాలో 23 శాతం ఉన్న 15 కులాలను ఎంపిక చేయడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని వారు అన్నారు. 2014 నుండి ఇప్పటివరకు కేసీఆర్ ప్రభుత్వం బీసీలను అనేక రూపాలలో ఉచిత హామీలు ఇస్తూ మోసం చేస్తుందని వారు ఆరోపించారు. తెలంగాణలో ప్రజలు చానా చైతన్యవంతులని ఇంతకాలం కేసీఆర్ చేసిన మోసాలను చాలా స్పష్టంగా గ్రహిస్తూ వస్తున్నారని ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి 760 జీవో తీసుకువస్తూ కేవలం 15 కులాలకు లక్ష రూపాయల రుణం కోసం 200 కోట్లు విడుదల చేసిందని వారు అన్నారు. బీసీలను కేవలం ఓట్ల యంత్రాలు గానే వాడుకునేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వారు అన్నారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో బీసీలకు ఉద్యోగాలు ఇచ్చి ఉంటే 53 వేల మందికి ఉపయోగముండేదని వారు అన్నారు.. తెలంగాణ జనాభాలు 62 లక్షలకు పైగా ఉన్న బీసీ కులాలను ఈ ఎలక్షన్ సమయంలో మోసం చేసేందుకు ఇలాంటి పథకాలు ముందుకు తీసుకువచ్చారని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో బీసీల కోసం అనేక పథకాలు తీసుకువచ్చిందని బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందిన వారు బీసీలే అధికమని వారు అన్నారు. 2023 ఎన్నికలలో బీసీల సమగ్ర నివేదికను తయారుచేసి ప్రజలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందని వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మైనార్టీ విభాగం అధ్యక్షులు జహీర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మిడ్జిల్

మండలంలోని వాడియాల గ్రామంలో ఎవరు చనిపోయిన 5000 రూపాయలు ఆర్థిక సాయం చేస్తూ మానవత్వం చాటుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కి చెందిన వాడియాల గడ్డల విజయకుమార్ 5000 రూపాయలు సాయం చేస్తూ ఆదుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని వాడ్యాల గ్రామానికి చెందిన సాలే చిన్నయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గడ్డల విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తదితర నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళ్ళ అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ పరంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఆమె ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మల్లయ్య, మంగలి రమేష్, బిర్ల మల్లయ్య, సులే మల్లయ్య, రామాచారి, రజాక్, ఖాజా, ఆనంద్, విరస్వామి, రమేష్, చిన్న నరసయ్య ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- సెక్టోరియల్ ఆఫీసర్ బాలు యాదవ్



నవతెలంగాణ - మహమ్మదాబాద్

ప్రభుత్వ బడులోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందుతుందని సెక్టోరియల్ ఆఫీసర్ బాలు యాదవ్ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నాయపల్లి,షేక్ పల్లి గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తుందని.. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మధ్యమ విద్యబోధనను కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు విద్యా సంవత్సరం నుండి నోట్ బుక్స్ ,వర్క్ బుక్స్ ఉచితంగా ఇస్తుందన్నారు. బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపి అద్భుత బడులను బలోపేతం చేసే బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పి వెంకట్,ఎస్ఎంసి చైర్మన్లు, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ -గట్టు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలొని మాచర్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మాచర్ల గ్రామంకు చెందిన మైలే లక్ష్మీ (50). కుమారుడుతో కలిసి ఇద్దరు అయిజ లో వారి బంధువుల ఫంక్షన్ కోసం బలిగెరా బస్ స్టాండ్ కు వెళ్తుండగా వెంకి టైలర్ షాప్ దగ్గర బలిగేరా వైపు నుండి వారికి ఎదురుగా టీఎస్ 33 టి 2582 గల ఆటో ఢీకొన్నది. డ్రైవర్ కుర్వ బాలాజి మాచర్ల గ్రామం చెందిన వ్యక్తి తన ఆటోను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి లక్ష్మీ కు తగలక ఆమె తలకు వెనుక భాగంలో రెండు చోట్ల బలమైన రక్త గాయాలు అయ్యాయి. దీంతో కుడి కాలుకు రక్త గాయామైంది. తరువాత 108 అంబులెన్సు లో ఎక్కించుకొని గద్వాల కు వెళ్తుండగా మార్గ మధ్యలో చనిపోయిన్నట్టు తెలిపారు. సంఘటనా పై రాఘేంద్ర దరఖాస్తు ఇవ్వగా ఎస్సై పవన్ కుమార్ కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహబూబ్ నగర్ లోని శిల్పారామంలో నిర్వహించిన మహబూబ్ నగర్ నియోజకవర్గ స్థాయి సంక్షేమ సంబరాలలో మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి 540 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 5 కోట్ల 40 లక్షల 62 వేల 640 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకుల అనుసంధానంతో 21 మహిళా స్వయం సహాయక సంఘాలకు కోటి14 లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఒక్కొక్కటి లక్ష డెబ్బై ఐదు వేల రూపాయల విలువచేసే 18 గొర్రెల యూనిట్లను రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం కింద పంపిణీ చేశారు. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల పై ఆధార పడే బీసీ కులాలకు ఆర్థిక అభివృద్ధి చేకూర్చే పథకాన్ని ఈరోజు నుండి ప్రారంభించగా, ఆ పథకం కింద 5 మంది లబ్ధిదారులకు లక్ష రూపాయల ను 100% సబ్సిడీ చెక్కులను అందజేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా 52 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించగా, అందులో 38 మందికి లక్ష రూపాయలు చొప్పున, 14 మందికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు .ఇదేకాక కులాంతర వివాహం చేసుకున్న ఒకరికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. 144 మంది లబ్ధిదారులకు సాంఘిక సంక్షేమ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు . 70 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన ప్రభుత్వాలు 200 రూపాయల పెన్షన్లు సైతం సక్రమంగా ఇవ్వలేదని, అలాంటిది తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెల 2016 రూపాయల పెన్షన్ ఇచ్చి పేదలలో భరోసాని కల్పించామని అన్నారు. అతి పేద కులాలు, వృత్తులు చేసుకునే వారికి,కుల వృత్తుల పై ఆధార పడి జీవించే బీసీలకు లక్ష రూపాయల చొప్పున తిరిగి రూపాయి కూడా చెల్లించకుండా 100% సబ్సిడీతో ఏర్పాటుచేసిన బిసి కులాల సంక్షేమ పథకం కింద ఈరోజు నుండే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నామన్నారు. మహబూబ్ నగర్ లో 5 మందికి ఈ పథకం కింద చెక్కులు అందించామని మంత్రి వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, మతాలు వర్గాల సంక్షేమంలో భాగంగా మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ఏదో ఒకరకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తో పాటు, కేసిఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా, పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నామని, గ్రామాలలో స్మశానవాటికలు, హరితహారం కింద మొక్కల పెంపకం, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు ప్రతి ఊరికి ట్రాక్టర్ వంటివి ఏర్పాటు చేశామని, అలాగే ఆయా కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా చేతివృత్తులు, కులవృత్తులకు చేయూతనిచ్చామని ,మత్స్య కార్మికులకు వలలు ఇతర సబ్సిడీ పథకాల అందించామని, చెరువులలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశామని తెలిపారు. గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ, దళితులకు దళిత బంద్ కింద పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.మహబూబ్ నగర్ సమీపంలోని దివిటిపల్లి ఐటి కారిడార్ లో రానున్న కాలంలో అనేక పెద్ద కంపెనీలు వచ్చి ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని గుర్తుచేశారు. మహబూబ్ నగర్ ను ఇంకా మరింత అభివృద్ధి చేస్తామని, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ ఒక బృందంగా ఏర్పడి లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున వచ్చే అన్ని రకాల లబ్ధిని సకాలంలో అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కే.సి నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, ఎంపీపీ సుధాశ్రీ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మైనార్టీ సంక్షేమ అధికారి టైటస్ పాల్, ఎస్ సి కార్పొరేషన్ ఈ.డి యాదయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందిస్తాం

- పాఠశాల సౌకర్యాలు కల్పించాల్సింది ప్రభుత్వ బాధ్యత
- తెలంగాణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత మాది అని అలాగే పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని తెలంగాణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట సందర్భంగా విద్యార్థుల ఎన్రోల్మెంట్ జరుగుతున్నది అందులో ఉపాధ్యాయులంతా భాగస్వాములు అవుతూ కృషి చేస్తున్నారు. నేడు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేది మా బాధ్యత కాని పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాల్సింది ప్రభుత్వ బాధ్యతని అన్నారు. అదే విధంగా సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతం, ప్రజాస్వామ్యం మొదలైన పాఠ్యంశాల తొలగింపు సరైనది కాదని అదే విధంగా బదిలీల ప్రక్రియను అర్ధాంతరంగా కోర్టు కేసులపేరుతో నిలిపి వేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. నేడు అనేక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది ప్రమోషన్స్ ఇచ్చి వెంటనే ఆకొరతను తీర్చాలన్నారు. లేనిచో ఉపాధ్యాయుల ఐక్య వేదికగా ఏర్పడి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా నూతన విద్యా విధానంపై కమిటి వేసి ప్రతిపాదన రూపొందించాలని డిమాండ్ చేశారు.విద్య కాషాయికరణ ను నిరోధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు నర్సిములు, ఉమాదేవి, కోశాధికారి భాస్కర్, రాష్ట్ర మాజీ కోశాధికారి కిష్టయ్య,రాష్ట్ర కమిటీ సభ్యులు సృజన, వేణుగోపాల్,జిల్లా కార్యదర్శులు అజయ్, హేమంత్, మన్యం, రాములు, తిరుపతమ్మ, కనకమ్మ, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ,తదితరులు పాల్గొన్నారు.



పకడ్బందీగా గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించాలి : కలెక్టర్



వనపర్తి : జూన్ 11న జరిగే గ్రూప్-1 పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించే విధంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలు రాసేందుకు వనపర్తి జిల్లాకు 4343 మంది అభ్యర్థులను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని వసతులు కలిగిన 14 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. 4 రూట్లు గా రూపొందించుకొని ప్రశ్నా పత్రాలు సమయానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం వంటి గంట వరకు పరీక్ష ఉంటుందని అందువల్ల అభ్యర్థులను పరీక్షా కేంద్రంలో ఉదయం 8.30 నుండి ఉ. 10.15 గంటల వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. 10.15 తర్వాత వచ్చే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలో అనుమతించడం జరగదని తెలిపారు. అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఆర్డీవో పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్లను మున్సిపల్ చైర్మన్ పరిశీలన

నవ తెలంగాణ వనపర్తి



వనపర్తి జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ శుక్రవారం పరిశీలించారు. వార్డులోని సివి రామన్ స్కూల్ నుండి ఫైర్ స్టేషన్ నంసింహ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్థానికుల కోరిక మేరకు సీసీ రోడ్డు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో పాటు ప్రజలకు ఆయన సూచించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ నందిమల్ల భువనేశ్వరి శ్యాం కుమార్ ఉన్నారు.

ప్రజల ఆర్థిక అభివృద్ధికి సంక్షేమ పథకాలు దోహదం

- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- ఘనంగా సంక్షేమ దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ- వనపర్తి

ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వాటిని అమలు పరుస్తూ, వివిధ వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఐ.డి.ఓ.సి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన "సంక్షేమ దినోత్సవం" వేడుకలకు జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సబ్బండ వర్ణాల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టి, అమలు పరుస్తూ వారి ఆర్థికాభివద్ధికి కృషి చేస్తున్నదని మంత్రి తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని మంత్రి అన్నారు. వృద్ధాప్య పెన్షన్ లు 16, 867 మందికి గాను రూ 340.04 లక్షలు, వితంతు పెన్షన్ లు 15,718 మందికి గాను రూ.316.87 లక్షలు, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు వంటి వివిధ రకాల పెన్షన్ లకు సంబంధించి జిల్లాలో మొత్తం 41,422 మందికి గాను రూ.902.21 లక్షలు ప్రతి నెల ఖర్చు చేస్తున్నదని, కొత్తగా 24,570 మందికి రూ.581.56 కోట్ల పెన్షన్ లు అందించటం జరుగుతున్నదని మంత్రి తెలిపారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలో 9.0 పాయింట్స్ పైన ఉత్తీర్ణత సాధించిన (7) మంది



విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అంతకు ముందు రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. 6 యూనిట్లకు సంబంధించిన (120) గొర్రెలను, (6) పొట్టేళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. దళిత బంధు పథకం ద్వారా రవాణా, డైరీ యూనిట్లు, పౌల్ట్రీ, ట్రాక్టర్ లు, వాహనాలు, కార్ ట్రాలీ, రిటైల్ షాపులు, సర్వీస్ సెక్టార్ విభాగాలలో మొత్తం 199 యూనిట్లకు ఒక్కొక్కటి రూ.10 లక్షల చొప్పున 19 కోట్ల 90 లక్షలు గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు. బి.సి. సంక్షేమ శాఖ ద్వారా (6) మంది లబ్ది దారులకు ఒక్కోకరికి లక్ష రూపాయల చొప్పున రూ 6 లక్షలు రుణాలను అందించినట్లు తెలిపారు. ఏ కారణం చేత అయిన రైతు మరణించినట్లైతే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలని, ఒక్కో విద్యార్థి మీద ఏటా ప్రభుత్వం రూ.1.20 లక్షలు ఖర్చు పెడుతూ లక్షల మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నదని ఆయన అన్నారు. 600 పడకల ఆసుపత్రి నిర్మించుకున్నట్లు, ప్రతి రెండు, మూడు గ్రామాలకు ఒక పల్లె దవాఖాన ఏర్పాటు చేయటం, డయాలసిస్ కోసం వనపర్తి లోనే ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని ఆయన అన్నారు. కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, ఆసరా వంటి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్, గొర్రెల కాపరి సంఘం అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, ఆర్డీవో పద్మావతి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బి.సి, ఎస్.సి, ఎస్. టి. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ది దారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న సాహిత్య దినోత్సవ వేడుకలు

వనపర్తి : జూన్ 11 వ తేదీన తెలంగాణ సాహిత్య దినోత్సవ వేడుకలు వనపర్తి జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం సమీకృత కార్యాలయాల సముదాయం స్టేట్ ఛాంబర్ లో సాహిత్య దినోత్సవం వేడుకల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. కవులు కళాకారులకు సమున్నత సహకారం అందిస్తూ వారి సేవలను గుర్తించడం జరిగిందన్నారు. అందువల్ల సాహిత్య దినోత్సవ వేడుకలు ఇంతకు ముందు అనుకున్నట్లు నూతన ఆడిటోరియం లో కాకుండా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయాన్నే 9.30 గంటలకు బతుకమ్మలు, కోలాటం, డప్పు వాయిద్యాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభం అయి 10 గంటలకు కవి సమ్మేళనం ఉంటుందన్నారు. మధ్య మధ్యలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. దీనికొరకు ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకొని బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ సాహిత్య దినోత్సవం నిర్వహణకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు. కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి సాహిత్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ డా. కే. వీరయ్య, బైరోజు చంద్రశేఖర్, నాగావరం బలరాం, బి. అమరనాథ్, వాకిటి శ్రీధర్, పోతుల రాము. డి.ఇ.ఒ. గోవింద రాజులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సైనిక భవనం : మంత్రి



మహబూబ్ నగర్ : దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు అంతస్తుల్లో సకల సదుపాయాలతో మహబూబ్‌నగర్‌లో సైనిక భవనాన్ని నిర్మించామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బండమీద పల్లిలో పాలమూరు యూనివర్సిటీ సమీపంలో రూ.1.75 కోట్ల వ్యయంతో నిర్మించిన సైనిక సంక్షేమ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాజీ సైనికులు, సైనిక సంక్షేమ శాఖ అధికారులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు... ఇన్నాళ్లు అద్దె భవనంలో సేవలు కొనసాగాయని ఇప్పుడు దర్జాగా సొంత భవనంలోకి సైనిక భవనాన్ని నిర్మించి ప్రారంభించుకున్నామని తెలిపారు. రాయచూరు జాతీయ రహదారిని ఆనుకుని ఎనిమిది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులు సకల సదుపాయాలతో సైనిక భవనం ఇకపై మాజీ సైనికులకు సేవలు అందిస్తుందన్నారు. ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం, ఆర్మీ క్యాంటీన్, పాలి క్లినిక్ ఒకే చోట ఉండడం వల్ల మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోకుండా సేవలు పొందేందుకు వీలవుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రవినాయక్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి వనజ, స్థానిక బీఆర్ఎస్ నాయకుడు గిరి, మాజీ సైనికులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న ఘనంగా సుపరిపాలన దినోత్సవం



వనపర్తి : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 10వ తేదీన నిర్వహించే సుపరిపాలన దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కార్యాలయాల సముదాయ కాన్ఫరెన్స్ హాల్లో రేపటి సుపరిపాలన దినోత్సవంతో పాటు జూన్ 19వ తేదీన జరిగే హరితహారం దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మండలాలు మున్సిపాలిటీలు గ్రామపంచాయతీలలో సుపరిపాలన వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరము మధ్యాహ్నము మూడు గంటలకు సమీకృత కార్యాలయ సముదాయంలో సుపరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 19వ తేదీన జరిగే తెలంగాణ హరిత దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లాలో స్థలం ఉన్న ప్రతిచోట మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వనపర్తి పట్టణంలో రోడ్డు మధ్యలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని, అటవీ ప్రాంతంలో ఖాళీ బ్లాక్ లను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. గత 9 సంవత్సరాల్లో హరితాహారం సందర్భంగా నాటిన మొక్కలు, జిల్లాలో పెరిగిన అటవీ శాతం పై సమగ్ర నివేదికలతో ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదరపు కలెక్టర్ బి వేణుగోపాల్ ఆర్డిఓ పద్మావతి పిడి డిఆర్డిఓ నరసింహులు మున్సిపల్ కమిషనర్లు జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

బీఎల్ఓ లకు సమావేశం



ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బిఎల్ఓ లకు మండల తాసిల్దార్ సింధుజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 01.10. 2023 నాటికి 18 సంవత్స రాలు నిండిన వారు దరఖాస్తు చేసుకునుటకు అర్హులని, మరియు 25.05. 2023 నుండి 23.06.2023 వరకు బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితా సవరణ చేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చాణక్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు నరసింహులు, జయమ్మ ,బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆడకూతురు పెండ్లికి అభిమన్యు రెడ్డి ఆర్థిక సహాయం



రాజాపూర్ :రాజాపూర్ మండలంలోని చెన్నవేల్లి గ్రామానికి చెందిన బొంకూరు నర్సింహులు కూతురు రమాదేవి పెండ్లికి 10,000/- రూపాయలు యువ సేన సభ్యుల ద్వారా ఆర్థిక సహాయన్ని అందించిన %దీక్షూ% పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి గారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రాజయ్య, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పిట్టల రాములు, ఎర్ర కృష్ణ, పెద్ద కురువ శ్రీను, వెంకటయ్య కుమార్, రాజాపూర్ మండల్ టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఉపాధ్యక్షులు అచ్యుత్ రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షులు మల్లేష్, మైబు, శ్రీను, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంక్షేమ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ -ఆత్మకూరు

అమరచింత పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయం నందు శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి 43 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి ,షాదీ ముబారక్ జక్కుల పంపిణీ చేశారు.సీఎం సహా నిధి చెక్కుల పంపిణీ. అమరచింత పట్టణానికి చెందిన బద్రి నాయక్ 19,000 ,వి కిరణ్ కుమార్ రెడ్డి 24000 ,వైష్ణవి 24,000 ,పాండు నాయక్ 42000 ,సరోజనమ్మ 54,000 చెక్కుల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అమృత మున్సిపల్ చైర్మన్ మంగమ్మ , వైస్ చైర్మన్ గోపి, జడ్పిటిసి సరోజ వెంకటయ్య, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు ,ఎంపీటీసీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జన సభను జయప్రదం చేయండి

నవ తెలంగాణ-ఆత్మకూరు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం లోని ప్రకాశం స్టేడియంలో జూన్ 11వ తేదీ సాయంత్రం మూడు గంటలకు జరిగే సిపిఐ ప్రజాగర్జన మహాసభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ప్రజలకు జిల్లా కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం బహిరంగ సభ గోడపత్రికను అమరచింతలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీజేపీకి హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 14 నుండి మే 11 వరకు 30 రోజులపాటు గ్రామ గ్రామాన పాదయాత్రలు చేసి బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లో ఎండ కట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఇట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెంలో ఇట్టి బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ,రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు నారాయణ,పల్ల చాడ వెంకటరెడ్డి సభకు హాజరవుతున్నారని అన్నారు. ఇటి కార్యక్రమంలో సిపిఐ అమరచింత మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్, మసప్ప ,ఏఐఎఫ్ జిల్లా కార్యదర్శికుతుబ్, పాల్గొన్నారు.

సమాజ హితం కోసం ప్లాస్టిక్ నివారిద్దాం



వనపర్తి :సమాజ హితం కోసం ప్లాస్టిక్ కవర్లను నివారించి అందరూ కాటన్ సంచులను ఉపయోగించాలని ప్రేమ్ టైలర్ ప్రొప్రైటర్ నానమోని మన్యం అన్నారు. ప్లాస్టిక్ సంచల నివారణ కోసం ప్రేమ్ టైలర్ మన్యం ఇటీవల కాటన్ సంచులను ముద్రించారు. ఈ కాటన్ సంచులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో టెంటు వేసి తెలిసినవారికి బాటసారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్లతో సమాజానికి చాలా నష్టం కలుగుతుందని, అవి భూమి లోపల విచ్ఛిన్నం కావడానికి కొన్ని ఏళ్ల సమయం పడుతుందని ఆయన అన్నారు. కాబట్టి కాటన్ సంచుల వినియోగం ద్వారా సరుకులను తెచ్చుకోవడం అలవాటు చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టైలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

నవ తెలంగాణ- కొత్తకోట



గత 30 సంవత్సరాలుగా పారిశుద్ధ కార్మికులు కొత్తకోటలో పనిచేస్తున్నారని కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సిఐటియు వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిషనర్ శ్రీనివాసులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా 11వ పిఆర్సి కమిషన్ చైర్మన్ సిఫారసును చేసిన వేతనాలను 19వేలు, 22,900, 31040 రూపాయలు కనీస వేతనం గా నిర్ణయించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ కార్మికులకు సంవత్సరానికి మూడు జతల యూనిఫామ్ సరిపడా చెప్పులు సబ్బులు నూనెలు ఇవ్వాలని ఆయన కోరారు. వయసు మీరిన కార్మికులను తొలగిస్తే వారసులు ఉంటే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ గా 10 లక్షలు ఇవ్వాలని వారసులు లేని వారికి 15లక్షలు నగదు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎన్ ఎం ఆర్ ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని ఆదివారాలు పండుగ సెలవులు అమలు చేయాలని దీని వాటర్ వర్కర్స్ కార్మికులకు కూడా వర్తింపచేయాలని ఆయన కోరారు. మున్సిపల్ కార్మికులకు అందరికీ మొదటి ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించి నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘంఅధ్యక్షులు కే వెంకటయ్య కార్యదర్శి శివ, ఆనంద్, రాజు, ఎర్రన్న, సత్తిరెడ్డి, ప్రసాదు, నోవెల్, లక్ష్మి, శిరీష, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టియూ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ- ఆత్మకూరు




ఆత్మకూరు పట్టణంలోని జాతీయ మైదానం రోడ్డులో గల టీచర్స్ యూనియన్ సమితి కార్యాలయం నందు శుక్రవారం ఎస్టి యు స్టేట్ టీచర్స్ యూనియన్ 76వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఎస్టియూ మండల అధ్యక్షులు సిఎస్ బాల స్వామి అధ్యక్షతన జరిగినది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు సి. హెచ్. ప్రసాద్ ,ఎస్ శ్రీనివాసరావు, పెద్దమందడి బాధ్యులు ఆర్ నరసింహ రావు కొత్తకోట మండల బాధ్యులు సురేష్ కుమార్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం ఎస్ టి యు ఏర్పడిందని అలాగే ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ చరిత్రను ,సంఘ ఏర్పాటు గురించి వివరించారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు .జూలై నుండి పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని ,పెండింగ్లో ఉన్న డి.ఏ.లను వెంటనే విడుదల చేయాలని మెడికల్ బ్లులు జిపిఎఫ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సంఘ ఉపాధ్యాయులుసుశీలమ్మ ,ఎండి రియాజుద్దీన్, దోమ శ్రీనివాసులు,విజయప్రకాష్, కే సత్యనారాయణ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నవతెలంగాణ- ఆత్మకూరు

ఇచ్చిన హామీలన్నీ ఈ ప్రభుత్వం నెరవేర్చాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, డివిజన్ నాయకులు సి.రాజు, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజన్న అన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షల దీక్ష దివస్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండల తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదు, కోటి ఆశలతో విద్యార్థి, యువకులు, ఉద్యోగుల ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములై కొట్లాడి తెచ్చుకున్న ఈ తెలంగాణలో అనేకమంది విద్యార్థి అమరవీరుల బలిదానాలు జరిగాయి .కానీ ఇచ్చిన హామీలన్నీ ఈ ప్రభుత్వం నెరవేర్చ లేదన్నారు.కార్యక్రమంలో సీపీఐఎంఎల్. ప్రజాపంథా, మండల పార్టీ నాయ కులు జి వెంకటయ్య, వెంకటేశ్, బాలస్వామి, రాములు, లక్ష్మణ్, వెంకటమ్మ, సుశీల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నాగర్‌కర్నూలు
3
శనివారం 10 జూన్ 2023



బడీఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

నవతెలంగాణ - తిమ్మాజీపేట

తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని భాజీపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బడిబయట పిల్లలను బడిలో చేర్పించి విద్యార్థులకు భోజనం చేసేందుకు వంట మనిషిని నియమించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా 184 మంది విద్యార్థులను బడిలో చేరిపించినట్లు మండల విద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. జూన్ 3 నుంచి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది ప్రతి గ్రామంలో పాఠశాల ఆధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలనే ఉద్దేశంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేశారని ఎంఈవో అన్నారు. శుక్రవారం ఒకే రోజు 34 మంది పిల్లలను బడిలో చేర్పించి నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలో 267 మంది విద్యార్థులను బడిలో చేర్పించామని ఆయన తెలిపారు.



సంక్షేమంలో దేశానికే ఆదర్శం మన తెలంగాణ

- ఎంపీ రాములు

నవ తెలంగాణ -కందనూలు



తెలంగాణ ప్రభుత్వ పాలనలో సంక్షేమంలో స్వర్ణయుగమని ఎంపీ రాములు కొనియాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దళితుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ పెంచారని పేద ప్రజల పాలిట దేవుడు కేసీఆర్ అని అన్నారు. శుక్రవారం నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశంలో సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ పోతుగంటి రాములు హాజరయ్యారు. ఎంపీ నిధులతో పదిమంది దివ్యాంగులకు 7 లక్షల 92 వేల రూపాయలతో ద్విచక్ర వాహనాలను జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎస్పీ కే మనోహర్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌లతో కలిసి ఎంపీ రాములు దివ్యాంగులకు పంపిణీ చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో పార్లమెంట్ రాజ్యసభల్లో 900కుపైగా ఎంపీలు ఉన్నారని ప్రతి ఎంపీకి 5 కోట్ల రూపాయల ఎంపీ నిధులు ఉంటుందన్నారు. దేశంలో ఏ ఎంపీ దివ్యాంగులకు వాహనాలను అందించలేదని ప్రథమంగా తాను మాత్రమే ఎంపీ నిధులతో జిల్లాలో ప్రతి సంవత్సరం రూ. 10 లక్షలు దివ్యాంగులకు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహేష్‌కు కృత్రిమ కాలు ఏర్పాటు చేసేందుకు 3 లక్షల 50 వేలు నిధుల విడుదలకు ప్రొసిడింగ్‌ను అందజేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనటువంటి ఆసరా పెన్షన్లను తెలంగాణలో అత్యధికంగా అందజేస్తున్నారన్నారు. జిల్లాలోని 1 లక్ష 12వేల 588 మందికి ప్రతి నెలకు 24కోట్ల 2లక్షల 17వేల 408 రూపాయల ఆసరా పింఛన్లను పొందుతు న్నారన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ సర్కారు సబ్బం డవర్గాలకు అండగా నిలుస్తున్నదన్నారు. ఈ తొమ్మిదేండ్లలో రాష్ట్రాన్ని చూస్తే సకల జనుల్లో సంతోషం, పల్లె, పట్టణం అనే తేడాలేకుండా అభివృద్ధిని కండ్ల ముందే చూపిస్తూ, కనీవినీ ఎరుగని సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ఫలాలను అందిస్తుంద న్నారు. దళితబంధుతో దళితుల దశాబ్దాల వెనుక బాటుతనాన్ని దూరం చేస్తూనే, వ్యవసాయరంగ చరిత్రలోనే నిలిచిపోయే 'రైతు బంధు' పథకం, రైతుకు ఏదైనా జరిగితే కుటుంబం ఆగం కాకుండా రైతు బీమాను అమలు చేస్తున్నదన్నారు. ఇంకా విద్య, వైద్యంతోపాటు అన్నిరంగాలకు సమప్రాధా న్యమిస్తూ, తొమ్మిదేండ్లలోనే విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ.. తెలం గాణ ప్రభుత్వం 9ఏళ్లలో సాధించిన ప్రగతి ఫలాలకు మహిళలందరూ రుణపడి ఉండాలన్నారు. ప్రతి ఇంటికీ కృష్ణ నీటితో మిషన్ భగీరథ నల్లాలతో జలాలు అంది స్తున్న ప్రభుత్వానికి ఆడపడుచున్న తరపున తాను కృతజ్ఞతలు చెబుతున్నా మన్నా రు. అంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదా నం నుంచి నూతన కలెక్టరేట్ వరకు దళిత బంధుపథకం ద్వారా లబ్ది పొందిన 33 మంది లబ్దిదారుల ట్రాక్టర్లతో జిల్లా షెడ్యూల్డ్ కులాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిం చారు. సంక్షేమ దినోత్సవం సంబరాల్లో మహిళలు బతుకమ్మ పాటలతో ఆకట్టుకు న్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై గేయ రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిని వెంకటలక్ష్మి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి రామ్‌లాల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, అదనపు డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ, డీపీఎం అరుణాదేవి, సంక్షేమ శాఖల అధికారులు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలందరికీ లక్ష రుణాలు ఇవ్వాలి

నవ తెలంగాణ- కందనూలు



జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. బీసీకుల చేతివృత్తులను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం జూన్ 9న ప్రారంభించనున్న బీసీ కులవృత్తుల ప్రోత్సాహక పథకపు అమలులోపాభూయిష్టంగా ఉందని ఈ విషయంపై ముఖ్య మంత్రి మంత్రివర్గపు సబ్‌కమిటీ విచారణ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. 6299 కోట్ల బీసీ బడ్జెట్లో రెండువందల కోట్లును విడుదల చేసి రూ. లక్షా మొత్తం ఈ పథకం సొమ్ముతో కేవలం 20వేల మందికే లబ్ది చేకూరుతుందని, ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో 15 కులాలు మాత్రమే చేర్చడం బీసీ కులాల మధ్య వివిధ వ్యత్యాసాలకు అనుమానాలకు తావిస్తుందని మల్లేష్‌గౌడ్ తెలిపారు. తెలం గాణలో రెండుకోట్ల జనాభా గలిగిన బీసీలకు పూర్తిస్థాయిలో లబ్ది చేకూరే విధంగా ఈ పథకాన్ని పునర్ సమీక్షించాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేసేలా చొరచూపాలని తెలిపారు. బీసీలకు అందజేసే రూ. లక్షా స్కీంను కేవలం 15 కులాలకే కాకుండా బీసీలలోని 130 కులాలకు లక్షరూపాయల రుణ సహాయాన్ని దశలవారీగా కాకుండా ఒకేసారి అన్ని కులాలకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి బీసీ కుటుంబా నికి రూ.10 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాళ్ల నిరంజన్, జిల్లా కన్వీనర్ రవీందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా యు వసేన అధ్యక్షుడు నేష లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, తిరుపత య్య, పబ్బతి శ్రీనివాసులు, బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోజి, కొత్రశ్రీని వాసులు, రామయ్యయాదవ్, పరమేష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: బీసీల అందరికీ లక్ష రూపాయల రుణాలు ఇవ్వాలని మండల బీసీ నాయకుడు ఎర్రోళ్ల తిరుపతయ్య ముదిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ కార్పొరేషన్ రుణాలకోసం బీసీ యువత యువకులు వేలమంది రుణాల కోసం దరఖాస్తు చేసుకొని తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న నేటికీ కార్యరూపం దాల్చడం లేదన్నారు. కొత్తగా బీసీలకు లక్ష రుణాలు పేరుతో 14 కులాల వారికి ఇస్తే మిగతా బీసీలకు జరుగుతుందన్నారు. బీసీలలో అన్ని కులాలకు లక్ష రూపాయల రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం పునరాలోచన చేసి బీసీల అందరికీ ఆదుకోవాలన్నారు.

రైతులందరికీ నష్టపరిహారం అందజేస్తాం..

- ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

నవ తెలంగాణ- వెల్దండ



కేఎల్ఐ, డీ 82, కాల్వల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారాన్ని అందజేస్తామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేఎల్ఐ, డీ82 కాల్వల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు రూ.11 26 కోట్ల మంజూరైయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. వెల్దండ, చెరుకూర్, బర్కత్‌పల్లి గ్రామాల రైతులకు రూ.5 కోట్లను త్వరలోనే మంజూరు చేయిస్తామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కడ్తల్ జెడ్పీటీసీ దశరత్‌నాయక్, రైతుసమన్వయ సమితి మండల అధ్యక్షుడు భాస్కర్‌రావు, అర్జున్‌రావ్ సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్‌లు దార్ల కుమార్, శ్రీనునాయక్, ఉపసర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్యా శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ- పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని జొన్నలబొగుడలో అభయ ఆంజనేయస్వామి నూతన ఆలయంలో అభయ ఆంజనేయస్వామి, నవగ్రహాల విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ట వేద పండితులతో వేదమంత్రాలతో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆలయకమిటీ సభ్యులు, పలువురు హెూమాలు చేశారు. అదేవిధంగా నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే బీరం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రా మంలో ఆంజనేయస్వామి నిర్మించడం చాలా గొప్ప విషయమని అందుకు సహకరించిన గ్రామ ప్రజలకు దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలపై చర్చ

నవతెలంగాణ- కోడేరు

మండలంలోని వడ్డేవాడ 14వ వార్డులో గడప గడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు అనే కార్యక్రమానికి శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. 14.వవార్డ్‌లో మాధవి కోమరే రాజుతో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే బీరం ఆధ్వర్యంలో ప్రతి పల్లెల్లో సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు అందే విధంగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవచూపనున్నట్లు రఘువర్ధన్ రెడ్డి ప్రజలతో మాట్లాడారు. అదేవిధంగా కాలనీలో విద్యుత్ సమస్య ఉండడంతో ఏడీతో మాట్లాడి కాలనీలో కరెంటు సమస్యతో ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సరైన సమయంలో కరెంటు వచ్చే విధంగా ప్రత్యేక చొరవచూపాలని ఏడీని వివరణ కోరినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతిపేదవాడికి అందేవిధంగా కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు

నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్



పట్టణంలో నూతనంగా నిర్మించిన వందపడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గతంలో ఆస్పత్రికి వస్తే ఇరుకుగా ఉండేదని, నేడు సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్మించుకున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో విశాలంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ల్యాప్రోస్కోపి ఆపరేషన్లకు కావాల్సిన సిబ్బంది రాష్ట్ర వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా అందుబాటులోకి వచ్చేందుకు చొరవ తీసుకోవాలని వారిని కోరారు. పెద్దకొత్తపల్లి మండలం మారేడు మానుదిన్నె గ్రామానికి చెందిన మహిళ దయాలసిస్తో బా ధపడుతూ మన ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవడం గొప్ప పరిణామంగా భా విస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇతర ప్రాంతాల వాళ్లకుండా ఇక్కడ చికిత్సకోసం ఏర్పాట్లను చేసుకుందామన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల అవగాహన కోసం జిల్లా వ్యాప్తంగా కళాజాత ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జరుపుకునే వైద్య ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని మంచి స్ఫూర్తిని నింపేందుకు కార్యక్రమాన్ని జరుపుకుందామని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అ ధ్యక్షుడు మనోహర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్దం పర్వతాలు



నావ తెలంగాణ- వంగూరు

జిల్లా సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు మండలంలోని రంగాపూర్‌లో శుక్రవారం శ్రీవారి హైస్కూల్లో నిర్వహించారు. ఈ క్లాసుల ప్రారంభానికి సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్దం పర్వతాలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వంపై పడకుండా మతం పేరుతో కులాల పేరుతో బీజేపీ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుందన్నారు. ఈ విధానాలపై ప్రజల్ని చైతన్యం చేస్తూ సీపీఎం పార్టీ కార్యకర్తలు ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని ఆయన పిలు పునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జెండాను సీపీఎం సీనియర్ నాయకులు ఏ రాముల ఆవిష్కరించారు. ఈ క్లాసులకు ఎల్. దేశ్యనాయక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లు ఆర్ శ్రీనివాసులు, బి ఆంజనేయులు, మండల కార్యదర్శి బి బాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, నరసింహ, శివవర్మ, శ్రీనివాసులు, అశోక్, ఈశ్వర్, దశరథం, అంతటి కాశన్న, నాగయ్య, మల్లయ్య, రామ కృష్ణ, బండి రాములు, రాములు, బాల య్య, శీను తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ సైకిళ్ల పంపిణీ



నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్

వికలాంగులకోసం నూతనంగా మంజూరైన ఎలక్ట్రిక్ సైకిళ్లను పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, డాక్టర్ గువ్వల బాలరాజు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగులకోసం వంద ఎలక్ట్రిక్ సైకిళ్లు మంజూరు కాగా, అర్హులైన 72మంది వికలాంగ లబ్ధిదారులకు అందజేశారు. సీఎం కేసీఆర్ వికలాంగులకు సహాయ సహకారాలు అందిస్తూ వారికి అండగా ఉంటున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ- కోడేరు

మండలంలోని మాచుపల్లి గ్రామనికి చెందిన చాకలి రమేష్ గత పది రోజుల కిందట మృతిచెందారు. మృతుడు రమేష్ కుటుంబానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూర్య, రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బుద్దుల పూర్ణచంద్రారెడ్డి, మాచుపల్లి రైతుబంధు అధ్యక్షుడు బండ్దెల నరేందర్ రెడ్డితో కలిసి పరామర్శించారు. ఆర్థిక సాయంగా బాధిత కుటుంబానికి సర్పంచ్ బుద్ధుల పూర్ణచంద్రారెడ్డి రూ. 5వేలు అందజేశారు. ప్రభుత్వం ద్వారా వృత్తి పనిచేసుకొనుటకు సబ్సిడీ స్కీంలు ఆ కుటుంబానికి వర్తించేటట్లు ఎమ్మెల్యే బీరం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేస్తామని భరోసా కల్పించారు.

12న చలో పాలమూరు



నవ తెలంగాణ- కందనూలు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభ ఈనెల12న సాయంత్రం 4 గంటలకు స్థలం రాయల్ ఫంక్షన్ హాల్, జెడ్పీ గ్రౌండ్‌లో ఉమ్మడి జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారు. జిల్లాలో ఉన్నటువంటి ఎంఎస్‌పీఎంఆర్పీఎస్, ఎంజెఎఫ్ నాయకులు, గ్రామ మండల తాలూకా జిల్లా స్థాయి నాయకులందరూ మహబూబ్‌నగర్‌లో జరిగే మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా నాయకులు ఎం వెంకటయ్య, శివ, కొమ్మురాములు, ఎస్సీ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పోలే భాస్కర్, నాయకులు రాజు, మహేష్, రవి, చిన్నయ్య ఎల్లయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట



ఉప్పునుంతల: మండలం కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి.హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మనఊరు -మనబడి కింద ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఏక రూపదుస్తులు, ఉచితంగా పుస్తకాలతోపాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, నోట్‌బుక్స్ అందించ నున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గుణాత్మక విద్యను అందించడానికి గత సంవత్సరంలో ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టి పిల్లల అభ్యసన స్థాయిలను గణనీయంగా పెంచిందన్నారు. బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించి, వారి అభివృద్ధికి బాటలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అనసూయ, కల్పన, సతీశ్, చంద్ర శేఖర్, శ్యాంసుందర్, అజ్మతుల్లా, కమలేకర్, నాగేశ్వర్‌రావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చాయ్ సెంటర్ దగ్ధం

- 1 లక్ష 50 వేల రూపాయల ఆస్తి నష్టం

నవ తెలంగాణ- పెద్దకొత్తపల్లి



మండల కేంద్రాల్లో జీవనోపాదికోసం నారాయణపల్లి గ్రామానికి చెందిన ఎస్ కురుమ య్య అనే యువకుడు రెండు నెలల క్రితం చాయ్ బిస్కెట్ సెంటర్‌ను ప్రారంభించాడు. గురు వారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో విద్యుదాఘానికి గురై దుకాణంలో ఉన్న ఫ్రిడ్జ్, ఐస్ క్రీమ్, కుర్చీలు, తదితర సామాగ్రి కాలి బూడిదఅయిపోయింద న్నారు. దీంతో రూ. లక్షా 50 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు కురుమయ్య తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కురుమయ్య కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాగర్జన



నవతెలంగాణ -కందనూలు

ఈ నెల 11న కొత్తగూడెంలో జరిగే ప్రజా గర్జన బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాలనరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో బహిరంగ సభవాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలుపరచి తెలంగాణకు న్యాయం చేయాలని, అదేవిధంగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేసి బ్రిటిష్ వారి కాలంలో సాధిం చుకున్న 29 కార్మిక చట్టాలను కొనసాగించాలన్నారు. ప్రైవేట్ సంస్థలలో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, ఉపాధిహామీ పథకాన్ని వంద రోజుల నుంచి 150 రోజులకు పెంచాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రణలో ఉంచాలని, దళితులందరికీ దళితబంధు పథకాన్ని కలెక్టర్ల ద్వారా పారదర్శకంగా అమలు చేయాలన్నారు. మైనార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు జనాభా ప్రతిపాదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యో గులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అర్హత కలిగిన వారందరికీ కొత్త రేషన్ కార్డులు తక్షణమే మంజూరు చేయాలన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ. 10 లక్షల వడ్డీలేని రుణాన్ని మంజూరు చేయాలని, ఆర్టీసీ సింగరేణి ఉద్యోగుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. పైన పేర్కొన్న హక్కుల సాధనకోసం సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలో వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా సమితిసభ్యులు కృష్ణాజి, మర్యాద వెంకట య్య, బండి లక్ష్మీపతి, మారేడు శివశంకర్, కపిలవాయి గోపి, కె.శివ కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవ తెలంగాణ -బిజినేపల్లి

మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన ఇర మోని బాలయ్య గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ గంగనమోని కుర్మయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్‌రావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ ఖాజా మైనోద్దీన్‌కు సన్మానం



నవ తెలంగాణ -బిజినేపల్లి

హజ్ యాత్రలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గం పాడి పంటలతో తులతూగాలని అల్లాతో ప్రార్థించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగనమోని కుర్మయ్య అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మంగనూరు నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న సయ్యద్ ఖాజా మైనోద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సౌర్వభౌమత్వానికి ప్రతీక అని అభివృద్ధిలో ముందున్న తెలంగాణ మరింతగా అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాతో ప్రార్థించాలని హజ్ యాత్రికలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కో -ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జహంగీర్, ముస్లిం మైనార్టీ సంఘం మండల నాయకులు మహమ్మద్, నాయకులు నసీర్, జాఫర్‌భాయ్, వహీద్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ అగ్రస్థానం

- ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థా నంలో ఉందని స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలో శుక్రవారం సంక్షేమ పథకాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో జరిగిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. దాదాపు 62 వేల కోట్ల రూ పాయలతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ఎంపీపీ సామ మనోహర, ఆర్డీవో రా జేష్‌కుమార్, వైస్ ఎంపీపీ కొండూరు గోవర్దన్, వైస్ చైర్మన్ షాహిద్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ చైర్మన్ బాలయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
గద్వాల, నారాయణపేట
4 శనివారం 10 జూన్ 2023

సీఎం సభ పోస్టర్ల ఆవిష్కరణ



గట్టు : ఈ నెల 12న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ భవన సముదయం,బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభించిన అనంతరం జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సీఎం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి రాయపురం గ్రామంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గట్టు తిమప్ప మాట్లాడుతూ కనివిని ఎరుగని రీతిలో సభను విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలను తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లా డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, గౌల్ల మహాదేవప్ప, జె. కర్రెప్ప, పెద్ద వెంకటేష్, గోవిందు, నర్సింహులు, తాయప్ప, సుధాకర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి: కౌన్సిలర్



ధరూరు : సీఎం సభను విజయవంతం చేయాలని కౌన్సిలర్ మురళి కోరారు. శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని 27వ వార్డులోని కౌన్సిలర్ మురళి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి 12న సీఎం కేసీఆర్ గద్వాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు.మధ్యాహ్నం 3:00 గంటలకు అయిజ రోడ్డు సమీపంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, మన వార్డు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి భారీ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని పేరుపేరునా కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటస్వామి, బాబు,ఈరన్న, కృష్ణ,చిన్న నర్సింహ, పరుష, రాజశేఖర్, రామకృష్ణ, నర్సింహులు, పోలేటిఆనంద్, అల్తాఫ్, వేణు, తిమ్మన్న, రామకృష్ణ, పాలెం వెంకటేష్, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చలో గద్వాల్..



జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలోని శుక్రవారం ధరూర్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుని గృహంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. స్థానిక గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సూచన మేరకు.. ఈ నెల 12న జరగబోయే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు భారీ సంఖ్య లో కార్యకర్తలు ప్రజలు తరలిరావాలని పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ధరూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, రామన్న, పెద్ద దేవన్న, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

కొనసాగుతున్న బడిబాట



ఊట్కూర్ : మండలంలోని నిడుగుర్తి గ్రామంలో ఎంపీయూ పీఎస్ పాఠశాల ఉపాధ్యాయబృందం ఆధ్వర్యంలో చేపడుతున్న బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం మండలంలోని లక్ష్మిపల్లి గ్రామంలో నిడుగుర్తి ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటిం టికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను కరపత్రాలు పంచుతూ అవగహన కల్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందం మాట్లాడుతూ సకల సౌకర్యాలు, అనుభవజ్ఞులు కలిగిన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు.సాధారణ విద్యతో పాటు ఎన్ఎంఎంఎస్ వంటిపోటీపరీక్షలో కూడా సత్తా చాటేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు లక్ష్మారెడ్డి, లక్ష్మీపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, ఉపాధ్యాయులు సలాం, శ్రీనివాస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

- పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు

ఊట్కూర్ : ఆయా ప్రభుత్వ శాఖల్లో నెలకొన్న ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు పదివేల నిరుద్యోగ భృతి చెల్లించాలని పీ వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధు కోరారు. శుక్రవారం తెలంగాణ ప్రజల ఆకాంక్షల దీక్ష దివాస్‌ను నిర్వహించాలని జూన్ 12న నారాయణపేటజిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బిజ్వార్, కొత్తపల్లి, పులిమామిడి గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు కే.మల్లేష్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్న సీఎ కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, పేదలకు రేషన్‌కార్డులు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూంలు, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి పూర్తిస్థాయిలో అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణలో వందలాదిమంది బలిదానాలు చేసి యువతీ,యువకులు , విద్యార్థులు, ప్రజలు ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించుకున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దీక్ష దివాస్ నిర్వహించాలని అందుకు మండలం, జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్ష చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీ. రవి , పిరికి రాము, ఆశప్ప , డోలిమి అంజప్ప, ఎల్. రామప్ప , డ్రైవర్ మహిపాల్ , రాజు తదితరులు పాల్గొన్నారు.



నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ



నారాయణపేట టౌన్ : నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాసిరకం విత్తనాల రవాణా, క్రయ, విక్రయాలపై అనుమతి లేని నాసిరకం పురుగుల మందులను విక్రయిస్తూ రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నాసిరకం విత్తనాలు విక్రయించే వారిపై నిఘా ఉంచడానికి జిల్లా, మండల స్థాయిలో ఎస్సైల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలను, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సీడ్స్ షాప్స్, మిల్లులు, ఫర్టిలైజర్ షాప్‌లలో తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను వాహనాల్లో తరలిస్తే అట్టి వాహనంను సీజ్ చేయడంతో పాటు యజమానిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానులు గమనించాలని సూచించారు. వ్యాపారులు విత్తనాలు విక్రయించే సమయంలో అన్ని వివరాలతో కూడిన రసీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో నిరంతరంగా ఆకస్మిక తనిఖీలు చేపడతామని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. లైసెన్సు కలిగిన వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయించిన, సరఫరా చేసిన, వారికి సహకరించిన వారెంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

విజయాలను వివరించేందుకే దశాబ్ది ఉత్సవాలు

- సంక్షేమ సంబురాలలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

ధరూరు : గత తొమ్మిది ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత న్నారు. శుక్రవారం సిఎన్జి ఫంక్షన్ హాల్లో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా భాగంగా తెలంగాణ సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్ పర్సన్ సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి ,ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమపథకాలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 24 గంటల విద్యుత్తు ,ఆసరా పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాధించిన విజయాలను ప్రజలకు చెప్పేందుకు 21 రోజులు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మనం చేసిన పనిని మనమే ప్రచారం చేసుకోవాలి అని తెలిపారు. రాష్ట్రంలోనే ఒక కొత్త గ్రామపంచాయతీలుగా తండాలో తీర్చిదిద్దారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అన్నపూర్ణగా రాష్ట్రంగా మారిందని, తెలంగాణా ఆడపడుచులు పొందిన గౌరవం ఏ రాష్టం లో లేదని , సంక్షేమ పథకాలు రాబోయే కాలంలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.ఎమ్మెల్యే పండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలు తెలంగాణలో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో అమలవుతున్నాయని అన్నారు. అన్ని రకాల కుల వృతుల వారిని గుర్తిస్తూ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తున్నదని తెలిపారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు గ్రామ గ్రామాన జరుగుతున్నాయని తెలిపారు. బీసీలలో కులవృత్తుల వారికి ఒక లక్ష ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద 15 మందికి లక్ష రూపాయల చెక్ ను అందజేస్తున్న మన్నారు. ఈ నెల 20 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. గతంలో ఇళ్ల ప్లాట్లు ఇచ్చిన వారికి పొజిషన్ చూపుతూ పట్టా సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. కొత్తవారికి కూడా స్థలాలు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జీవో 58, 59 ద్వారా ప్రభుత్వ స్థలాలలో కట్టుకున్న వారికి రెగ్యులర్ చేస్తామన్నారు. అన్ని కుల వృతుల వారికీ లక్ష రూపాయల చెక్‌ను 15 మందికి అందజేశారు. అదేవిదంగా 70 సంగాలకు 5. 17 కోట్ల చెక్ ను మహిళా సంగాల వారికీ అందజేశారు. ఇద్దరు లబ్ది దారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కు సంబంధించి పట్టాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా గొర్రెల పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బీ.ఎస్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీలు విజయ్, ప్రతాప్ గౌడ్, నజూమున్నీసా బేగం, మనోరమ్మ జడ్పిటిసిలు రాజశేఖర్, బాసు శ్యామల వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, కౌన్సిలర్స్ , జిల్లా అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నారాయణపేటటౌన్ : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని జీపీ శెట్టి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిం చిన సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు.21 రోజులపాటు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతతొమ్మిది సంవత్సరాలలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించడానికి కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బీసీ కులాలకు లక్ష రూపాయల సహాయం అందుతుందని అన్నారు. 650 కళ్యాణలక్ష్మి , 34ఇంటి స్థలాలు 12 యూనిట్ల గొర్రెల పంపిణీ, బీసీ కుల వృత్తుల వారికి నలుగురికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారిని అభివృద్ధి చేసేందుకుగాను లక్ష అందజేస్తుందని, ఆన్లైన్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి



దరూర్‌లో..

చంద్రశేఖరరావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నారాయ ణపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు.నాయీ బ్రాహ్మణులకు 250 యూనిట్లకు ఉచితంగా వి ద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 4 వేల ఇళ్ల పట్టాలి స్తున్నట్లు తెలిపారు. దామరగిద్ద మండలంలో 34 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అంది స్తున్నట్లు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథ కాల చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్స్, ఇండ్ల పట్టాలు, షాదీ ముబారక్ కళ్యాణ్ లక్ష్మి చె క్కులు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్,అదనపు కలెక్టర్ , జెడ్పీటీసీ అం జలి రాములు ముదిరాజ్, ఎం. జ్యోతి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ పీలు, జిల్లా రైతు బందు ప్రెసిడెంట్, జెడ్పీ టీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్ప ంచులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ అగ్రగామి : ఎమ్మెల్యే

ఉండవల్లి : సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంక్షేమం కార్యక్రమానికి ఎమ్మెల్యే అబ్రహం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పింఛన్లు 2016లో పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. కళ్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాలతో లక్ష 116 రూపాయల పెళ్లికానుకగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు,గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్ల చదువుకు ఎల్కేజీ నుంచి పీజీ వరకు గురుకులాలు, విదేశీ విద్యా రుణాలు , గ్రూప్ వన్ గ్రూప్ టు స్టడీ సెంటర్లు తదితర వంటి రంగాల్లోనే ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువచ్చిందని వివరించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు పెట్టిన స్టాళ్లను పరిశీలించారు. వికలాంగులకు సదరం క్యాంపుల ద్వారా ఇచ్చిన ధ్రువపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అల్లంపూర్ నియోజకవర్గం లోని 44 సంఘాలకు రూ.11 కోట్ల యాభై ఐదు లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. పేదలు ప్రభుత్వ సంక్షేమాలు పొంది అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మనోరమన్ , మిస్సమ్మ , జెడ్పీటీసీ కాశీ పోగురాజు డీఆర్డిఏ పీడీ నాగేంద అల్లంపూరు, మానపాడు, ఉండవెల్లి , వడ్డే పల్లి రాజోలి, ఇటికాల మండలాల్లోని మండల అభివృద్ధి అధికారులు తాహ సీల్దార్లు, ఆయా శాఖల అధికారులు , ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, పశువైద్యాధికారి శిరీష , ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు ఆసరా : ఎమ్మెల్యే

కోస్గి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల్లో ఆర్థిక భరోసా ఇస్తున్నాయని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఏ బీ కే ఫంక్షన్ హాల్ లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ పథకాల సంబురాలు



కోస్గిలో..



నారాయణపేటలో..



ఉండవల్లిలో..

చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 24 గంటల ఉచిత విద్యుత్, వంటి పథకాలను ప్రవేశపెట్టి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదరికానికి అందిస్తున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కి దక్కిందని అన్నారు. త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ, కులవృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక భరోసాను కల్పించడం హర్షణీయమన్నారు. అనంతరం కోస్గి,గుండు మాల్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 16మంది లబ్ధిదారులకు రూ. 4,94,200ల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి, ఎంపీపీ మధుకర్ రావు, వైస్ ఎంపీపీ సాయిలు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, మున్సిపాలిటీ చైర్మన్ మేకల శిరీష రాజేష్, తాహసీల్దార్ మమత, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీనివాస్, మేకల రాజేష్, వెంకట్ రాములు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి

- అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం డిమాండ్

నారాయణపేటటౌన్ : స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్రప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్కు ప్రకటించిన మద్దతు ధరలు అసమగ్రంగా ఉన్నాయని పేర్కొంటూ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిల భారత ప్రగశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023 -24 సంవత్సరం ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎంఎస్పి) ముందే ప్రకటిస్తున్నట్టుగా, ఎవరు ఏ ప్రభుత్వం పెంచలేనట్టుగా పెంచుతున్నామని కేంద్రప్రభుత్వం ఆహార శాఖ మంత్రి పియూష్ గోయల్ చంకలు గుద్దుకుంటున్నటువంటి పరిస్థితి నేడు అగుపడుతుందన్నారు. ఏదో కొన్ని పంటలకు మాత్రమే ఎంఎస్పీ ప్రకటించడం కాదని, దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు అన్నిటికీ సమగ్రమైన స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. కానీ అందుకు భిన్నంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎద్దేవాచేశారు. ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టోలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని, ఆ రకంగా మద్దతు ధరలు కేటాయిస్తామని చెప్పారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా 2018 -19 బడ్జెట్ సమావేశంలో నిర్ణయం చేసింది ఏమిటి ఈ దేశ రైతాంగం పండించిన పంటలపై పెట్టే పెట్టుబడిపై 50శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు కేటాయిస్తామని, ఆ రకంగా ఈ దేశ రైతాంగ ఆదాయం 2023 నాటికి ఈ రోజు ఉన్న ఆదాయం కంటే రెట్టింపు ఆదాయం చేస్తామని మరోసారి అవకాశం ఇవ్వాలని రైతాంగాన్ని ప్రజలను మభ్య పెట్టే వాగ్దానాలు చేశారన్నారు. గత సంవత్సరం మద్దతు ధరలకు ఐదు శాతం నుంచి ఒకటి రెండు పంటలకు 10 శాతం పెంచి చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. 2023 ప్రకారంగా మద్దతు ధరలు



ప్రకటిస్తే రెట్టింపు ఆదాయం ఎలా రైతాంగానికి వస్తుందని ప్రశ్నించారు. రైతు చట్టాలపై ఢిల్లీలో జరుగుతున్న ఉద్యమ సందర్భంలో రైతు సంఘం నేతలతో మద్దతు ధరల విషయంపై ఉన్నత కమిటీ వేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఊసేలేదన్నారు. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న.. ఓడ దాటినంక బోడి మల్లన్న అన్నట్టు కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇచ్చిన హామీల మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మరో ఢిల్లీ ఉద్యమం ఉద్భవిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, నారాయణ, ఏ.రాములు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షులు జీ.వెంకట్రాములు, హాజీ మలాన్, అరుణోదయ రాష్ట్ర నాయకులు అంజి , పీవైఎల్ జిల్లా నాయకులు హనుమంతు, జిల్లా నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ధరూరు : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్, ఐ ఎఫ్ టీయూ , కారోబార్స్ , బిల్ కలెక్టర్స్ స్వీపార్స్, వాటర్ మాన్, డ్రైవర్స్ తదితరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. జీపీ వర్కర్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి బీచ్‌పల్లిజమ్మిచేడు కార్తీక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించి ఈ గ్రాంట్ నుంచే వేతనాలు చెల్లించాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు.పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.ఆదివారం పండుగ సెలవులు, జాతీయ ,అంతర్జాతీయ దినాలను అమలు చేయాలన్నారు. కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు అక్రమ తొలగింపులను ఆపాలన్నారు. ఈ కార్యక్రమములో రాఘవేంద్ర , రంగన్న , గోవిందు, చంద్రన్న, ప్రభుదాసు ,బుడ్డన్న, కృష్ణ , అంజి, హనుమంతు, దేవరాజు , వీరన్న, శాంతన్న , అనిల్ , ఆంజనేయులు , వెంకటేష్ , మారెప్ప, కాలప్ప , వీరేష్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

- స్పందించని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



ధరూరు :మండలంలోని జాంపల్లి గ్రామ శివారులో నిన్న రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలులకు ప్రధాన రహ దారికి ఇరువైపులా ఉన్న చెట్లు నేలమట్ట మయ్యాయి. గద్వాల్ - రాయచూరు ప్రధాన రహదరిపై చెట్లు విరిగి పడటంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగవచ్చని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైన పడ్డా విరిగిన చెట్లను తొలగించాలని వాహనాదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

గట్టు : మండలంలోని మాచర్ల గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 145మందికి పరీక్షలు చేశారు. అందులో 10మందికి అద్దాలు అందజేసి, 15 మంది ఆర్డర్ గ్లాసులు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సూపర్వైజర్ సాయి కిరణ్, సూపర్వైజర్ స్వర్ణలత , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ధరూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడక ముందు సీఎం కేసీఆర్ ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముస్లిం మైనార్టీలు కోరారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య కి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కి, కలెక్టర్ కి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాట య్యాక రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా అ య్యారన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు 9 సంవత్సరాలు గడిచినప్పటికీ ముస్లిం మైనార్టీలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి తేదీ 12న సోమవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ ఆఫీసు కార్యాలయం ప్రారం భోత్సవ కార్యక్రమానికి గద్వాలకు వస్తున్న సంద ర్భంగా ముస్లిం మైనారిటీల తరపున స్వాగతం పలుకుతూ అందులో భాగంగా మరొకసారి ముస్లిం మైనార్టీలకు ప్రకటించిన వాగ్దానాలను అమలు పరిచేలా కృషి చేయాలని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి విన్నవించి న్యాయమైన డిమాండ్లను అమలు చేయుటకై కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం మైనారిటీ ముఖ్య నాయకులు అతికూర్ రెహమాన్ , మాజీ కౌన్సిలర్ ఇసాక్ , ఉద్యమ కారుడు టవర్ మక్బుల్



మహబూబ్ అలీ , ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు రహమతుల్లా, జావీద్, చాంద్ పాషా, అబ్దుల్ అజీమ్, కుతుబుద్దీన్, యూనుస్, ఖాజావలి, షఫీ, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు :

రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. గద్వాల జిల్లాలో ముస్లిం రెసిడెన్షియల్ బాలుర పాఠశాల వెంటనే మంజూరు చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్‌లను విడుదల చేయాలి. మైనార్టీలకు రెండు లక్షల లోన్ సదుపాయం కల్పించాలి. డబుల్ బెడ్రూంలలో మైనార్టీలకు న్యాయం చేయాలి. అసెంబ్లీ ఎన్నికలలో ముస్లింలకు 15 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి.